# హరిశ్చంద్రుడి కథ



బి.విద్యాసాగర్

రామారావు ఆఫీసుకు వెళ్ళడానికి బస్ స్టాపు దగ్గర నుంచున్నాడు. ఎంత సేపటికీ బస్సు రావడం లేదు. పది గంటలు దాటింది. ఇంతలో రాజారావు వచ్చాడు. ఇద్దరూ వొక బేంకులో గుమాస్తాలుగా పని చేస్తున్నారు.

“ఏమోయ్ రాజారావు! బస్సు లేదు. ఏమిచేద్దాము! టాక్సీలో వెళ్దామా!” అన్నాడు రామారావు ఖంగారు పడుతూ.

“ఊరికే ఖంగారు పడకు! ఒక పది నిముషాలు ఆలస్యంగా వెళ్తే ప్రమాదం యేమిలేదు” అన్నాడు రాజారావు.

"అలస్యంగా వెళ్తే బాగుంటుందా? ఏజంట్ విసుక్కుంటాడేమో? మన ఖాతా దార్లు మన కోసం కనిపెట్టుకు కూర్చోవాలి కదా!

"నువ్వు వూరికే భయపడమాకు! ఒక పావు గంట అలస్యం అయినా ఫరవా లేదు. గంట లేటుగా వస్తున్నారు కొంత మంది."

"ఎవరో కొంత మంది ఆలస్యంగా వస్తున్నారని మనం లేటుగా వెళ్తే బాగుంటుందా!"

"బస్సు లేకపోతే యేమి చేస్తాము? అదిగో మాటలోనే బస్సు వచ్చింది. వెళ్దాము పద" అన్నాడు రాజారావు.

ఇద్దరూ బస్సు యెక్కారు. అప్పటికి 10-25 అయింది. బస్సులో జనం బాగా వున్నారు. చాలామంది నుంచుని వున్నారు. కదిలేందుకు సందులేదు. కండక్టర్ అటూ యిటూ తిరుగ లేక వొకచోట నుంచు న్నాడు. పావుగంట గడిచింది. బస్ స్టాప్ వచ్చింది. చాలామంది దిగారు. రామారావు రాజారావుకూడా దిగారు. రామారావు కండక్టర్‌ని పిలిచి, "నాకు టికెట్ యివ్వలేదు. నేను ముషీరాబాద్ నుంచి వస్తున్నాను." అంటూ పదిహేను పైసలు యిచ్చాడు. అతను అది జేబులో వేసుకున్నాడు. టికెట్ యివ్వలేదు. రామారావు అదేమి పట్టించుకోకుండా, గబగబా నడుస్తూ, త్వరగా ఆఫీసుకు చేరు కోవాలని ఆదుర్దా పడుతున్నాడు. పక్కన నడుస్తున్న రాజారావు.

"నెమ్మదిగా నడు! తొందర లేదు! మరొక అయిదు నిమిషాలు అలస్యం అయితే కొంపలేమి అంటుకోవు. అదిసరే బస్సుదిగాక కండక్టర్‌ని పిలిచి డబ్బులిస్తావేమిటి!" అన్నాడు.

"కండక్టర్ నాకు టికెట్ యివ్వలేదు. అందుకని పిలిచి యిచ్చాను." ఉచితంగా ప్రయాణం చేయడం తప్పు కదా!" అన్నాడు రామారావు.

"బాగుంది! ఇప్పుడు మనతోపాటు దిగిన వాళ్ళలో చాలామంది దగ్గర టికెట్లు లేవు. వాళ్ళంతా నీలాగా కండక్టర్‌ని పిలిచి డబ్బులు యిస్తున్నారా? లేదు. వాళ్ళదారిన వాళ్లు పోతున్నారు. కండక్టర్ టికెట్ తీసుకున్నారా అని అడిగితే, చాలమంది తీసుకోక పోయినా తల వూపుతున్నారు. నువ్వు గమనించావో లేదో! నువ్వు హరిశ్చంద్రుడిలాగా, పిలిచి డబ్బులు యిచ్చావు. అది సద్వినియోగం అయిందా? లేదు! కండక్టర్ టికెట్ యివ్వకుండా జేబులో వేసుకున్నాడు," అన్నాడు రాజారావు.

"పోనీ, యేమి చేస్తాము! వాడి కర్మ్కర్మ వాడిది" అన్నాడు రామారావు.

ఇద్దరూ ఆఫీసు చేరుకున్నారు. రాజారావు 10-30 అని మార్కు చేసి సంతకం చేసి తన సీటుకు వెళ్ళి కూర్చు

న్నాడు, రామారావుమాత్రం అకౌంటెంట్ దగ్గరకు వెళ్ళి "క్షమించండి సార్! బస్సు లేక అలస్యం అయింది." అని అటెండెన్స్ రిజిష్టర్‌లో 10-45 గం|| లు వ్రాసి సంతకం చేశాడు. అవేళ బేంకులో పని బాగావుంది. 2-30 గం|| అయింది. అంతా టిఫిన్ తీసుకోవడం కోసం లేచారు. కొంతమంది బ్రహ్మచారులు హోటలుకు వెళ్దామని, బయటకు వెళ్ళారు. గృహస్థులు టిఫిన్‌బాక్సు తీసుకొని లంచ్‌రూమ్ లోకి వెళ్ళారు. టిఫిన్, కాఫీ తీసుకున్నాక, అంతా కబుర్లలో పడ్డారు. రాజకీయాలు, సినిమాలు, ఆటలు గురించి వ్యాఖ్యానాలు చేస్తున్నారు. కొంతమంది న్యూస్ పేపర్లు, మేగజైన్స్ చదువుతూ కాలక్షేపం చేస్తున్నారు. ఎవరూ టైము సంగతి పట్టించుకోవడం లేదు. బేంకులో, అరగంటలో టిఫిన్ తీసుకుని మళ్ళీ డ్యూటీలోకి రావాలని నియమం ఉంది. కాని అవి యెవరూ ఖచ్చితంగా పాటించరు. గంటనుంచి, గంటన్నరదాకా ఈ అవకాశాన్ని వినియోగించు కుంటారు. రామారావు అరగంట కాగానే, మళ్ళీ సీటుకు వెళ్ళి పోయాడు.

"ఆగవోయ్ హరిచంశ్చ్రద్రా! అప్పుడే తొందరేమిటి! ఇంకొక అరగంట పోయాక వెళ్ళ వచ్చును" అన్నాడు రాజారావు.

"పని చాలావుంది.వోవర్‌టైము చేయవలసివస్తుంది, వెంటనే వెళ్ళకపోతే."

"చెయ్యవోయ్! తప్పేముంది! మేమంతా చేయడం లేదా!"

"అనవసరంగా బ్యాంకుకు దండుగ చేయడం దేనికి! ఇప్పుడు వెంటనే డ్యూటీలోకి వెళ్ళిపోతే, 5-30 గం|| కల్లా పనిపూర్తి చేసుకుని యింటికి వెళ్ళిపోవచ్చును."

"నీలాంటివాళ్లు యెవరూ ఉండరోయ్! చాలామంది పని లేకపోయినా వోవరుటైమ్ చేసి, డబ్బు సంపాదిస్తుంటే, నువ్వు పనివున్నా, వోవర్‌టైమ్ చేయకుండా వెళ్ళిపోతానంటున్నావు. ఛరే వాడివే!" అన్నాడు రాజారావు.

"నాకు అనవసరంగా ఓవర్‌టైమ్ చేయడం అంటే యిష్టం వుండదు."

"నువ్వు వొక్కడివీ 'సిన్సియర్'గా పనిచేయడం వలన బేంకుకు లాభాలు యేమిరావులే! ఫరవాలేదు కూర్చో!"

"కాదులే! నాకు పనివుంది వెళ్ళాలి!" అని రామారావు తన సీటుకు వెళ్ళి కూర్చుని తన పనిలో నిమగ్నుడయాడు. మిగతా వాళ్ళంతా మరొక ముప్పావుగంట గడిచాక, మళ్ళీ డ్యూటీలో చేరారు. ఏవో కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు కాని, చురుకుగా యెవరూ పని చేయడం లేదు. రామారావు మాత్రం యెంతపనివున్నా, హడావుడిగా చేసి పారేస్తున్నాడు. మిగతా వాళ్ళు 5-30 గం|| దాకా కాలక్షేపం చేసి వోవర్‌టైమ్ మొదలు

పెట్టారు. రామారావు పని పూర్తి చేసుకుని వెళ్ళి పోయాడు. "వట్టి హరిశ్చంద్రుడు" అని తనలో నవ్వుకున్నాడు రాజారావు. పని లేక పోయినా రాత్రి 7-30 గం॥ దాకా కాలక్షేపం చేశాడు రాజారావు.

మర్నాడు రోడ్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ సిబ్బంది సమ్మె చేయడం వలన బస్సులు లేవు. చాలామంది ఆరోజు శలవు పెట్టారు, కాని రామారావు టాక్సీలో బేంకుకు వెళ్ళాడు. అకౌంటెంటే అతనిని చూసి మెచ్చుకున్నాడు, రాజారావు, ఇంకా కొంత మంది గుమస్తాలు శలవు పెట్టారు.

రామారావు బేంకులోచేరి వొక సంవత్సరం దాటింది. అతనికి వొకసారి అర్జంటుగా డబ్బు కావాలసి వచ్చింది. ఎవరి దగ్గర అప్పు తీసుకుందామా అని ఆలోచిస్తున్నాడు. రాజారావు దగ్గర అతనికి బాగా చనువు వుంది కనుక, అతనిని అడుగుదామనుకున్నాడు. అవేళ బేంకులో అడిగేశాడు.

"రాజారావు! నీ దగ్గర వొక వంద రూపాయలు ఉంటే యివ్వు! అర్జంటుగా కావాలి, వచ్చే నెలలో యిస్తాను." అన్నాడు.

"ఏమిటి సంగతి!"

"బంధువుల యింట్లో పెళ్ళికి వెళ్ళి రావాలి. రైలు ఖర్చులకు, ప్రజంటెషన్‌కీ, వాటికీ వొక వందరూపాయలు దాకా కావాలి."

"చంపేశావే! నాదగ్గర లేదే." అన్నాడు రాజారావు.

"పోనీ మన స్నేహితులు యెవరి దగ్గర అయినా అప్పు పుడుతుందేమో!" అన్నాడు రామారావు.

"ఎవరి దగ్గర ఈ నెలాఖరు రోజుల్లో వుండదు.

"అయితే యేమిటి చేయడం!"

"దీనికింత ఆలోచనదేనికి! అన్నట్లు, ఈ యేడు మెడికల్ బిల్ తీసుకున్నావా."

"లేదు. తీసుకోలేదు, నా కేమయినా జబ్బు చేస్తేకదా! డుక్కలాగా వున్నాను. మెడికల్ బిల్ యెలా తీసుకుంటాను?" అన్నాడు రామారావు అమాయకంగా.

"వర్రి అమాయకుడిలాగా వున్నావే! మేమంతా జబ్బు చేస్తేనే మెడికల్ బిల్ తీసుకుంటున్నామనుకున్నావా! అదే మీ లేదు. ఎప్పుడు డబ్బు అవసరం అయితే, అప్పుడు డాక్టరుకు వొక పదిరూయలు యిచ్చి బిల్లు సృష్టిస్తాము. అది బేంక్‌లో యిచ్చి పాస్ చేయించుకుంటాము." అన్నాడు రాజారావు.

"ఛ! దొంగబిల్సు యిస్తున్నారా! తప్పు కదూ! అన్యాయం కదూ! మీరంతా బేంకును మోసం చేస్తున్నారన్న మాట!"

"నాయనా! హరిశ్చంద్రా! నీ దృష్టిలో అంతా తప్పే! అంతా అన్యాయమే! ఓవర్‌టైము చేయడం తప్పు! మెడికల్ బిల్లు సృష్టించడం తప్పు!! రేపు బేంకు




వాళ్ళు బోనస్ యిస్తే యెందుకు, జీతాలు యిస్తున్నారుగా, అఖ్ఖరలేదు లెండి అనే టట్లు వున్నావు. నువ్వు క్రొత్తగా బేంకులో చేరావుకదా? ఇక్కడ పరిస్థితులు నీ కేమి తెలియవు. మరీ మడిగట్టుకు కూర్చుంటే, బేంకులో పనిచేయడం కష్టం! కాస్త సద్దుకు పోవాలి,''

''అనవసరంగా వోవర్ టైము చేయడం, దొంగ మెడికల్ బిల్లు తయారు చేయడం అన్యాయం అక్రమం కాదా!''

''అన్యాయమే! కాదనను! కానీ డబ్బు సంపాదించాలంటే కాస్త కక్కుర్తి పడక తప్పదు .... ఇదంతా యెందుకు! నీకు వందరూపాయలు కావాలన్నావు కదా! సాయంత్రం నాతో రా! డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళి బిల్లు తయారు చేయిస్తాను. నీ దగ్గర డబ్బు లేకపోతే, డాక్టరుకు యివ్వవలసిన పది రూపాయలు నేను యిస్తాను. రేపు బిల్లు పాస్అయి నాక నాకు తిరిగి యిద్దువు గానీ.''

''నేను బిల్లు తీసుకుంటే, మన ఏజంటే పాస్ చేస్తాడా! దుక్కలాగా వున్నావు. నీకు జబ్బేమిటి'' అని అడుగుతాడు.''

''ఏమి అడుగడు! మెడిక్ల్ బిల్తో పాటు, నువ్వు వొకలెటర్ యిస్తే, అది చూసి పాస్ చేస్తారు. సంవత్సరం పొడు.

గునా యెవరో వొకరు మెడికల్ బిల్ తీసుకుంటునే వుంటారు. ఏజంట్, అకౌంటెంట్ మాట్లాడకుండా పాస్ చేస్తారు. నీకు యిది మొదటి బిల్ కనుక అంతే క్రొత్తగా వుంది. కొన్నాళ్ళుపోతే, నువ్వే మిగతవాళ్ళకు పాఠాలు నేర్పుతావు.'' అన్నాడు రాజారావు.

''నాకెందుకో బేంకుని మోసం చేసి డబ్బు సంపాదించడం అంటే బాధగా వుంది. అన్యాయం సొమ్ము కదా!''

''ఇవన్నీ ఆలోచిస్తూ కూర్చుంటే నువ్వు బేంకులో పనిచేయడం కష్టం! కాస్త సద్దుకు పోవాలి.'' అన్నాడు రాజారావు.

ఆరోజు సాయంత్రం రామారావు, తన మనస్సును సమాధాన పరచుకుని, తన నియమానికి విరుద్ధమయినా సరేనని, డాక్టరు దగ్గరకువెళ్ళి వొక పదిరూపాయలు యిచ్చి 140 రూపాయలకు మెడికల్ బిల్లు తీసుకున్నాడు. మర్నాడు బేంకులోయిచ్చి పాస్ చేయించు కున్నాడు. ఆ విధంగా హరిశ్చంద్రుడికి వ్రత భంగం అయింది.

రామారావుకు తర్వాత కొద్దిరోజులకు వివాహం అయింది. భార్య కాపురానికి వచ్చింది. కుటుంబ నిర్వహణకు వచ్చే జీతం చాలక, వోవర్ టైమ్‌చేసి సంపాదిస్తున్నాడు. ఇదివరలో అనవసరముగా వోవర్‌టైము చేయడం యెందుకని భావించినవాడు, ఈనాడు పని ఆలస్యం చేసి సంపాదించడానికి తెగించాడు. దొంగ మెడికల్ బిల్సు సృష్టించడం అలవాటు చేసుకున్నాడు. రాజారావు యిదంతా గమనించి

''హరిశ్చంద్రుడిలో వొ లా మా ర్పు వచ్చిందే! నువ్వు మాలాగ తయారయావు'' అన్నాడు వొకరోజు.

''ఏమి చేయమంటావు! మడికట్టుకు కూర్చుంటే కుదరదని, నాధోరణి మార్చుకున్నాను. నలుగురితోపాటు నారాయణ!''

''రామారావు! నేను యివేళ రాయల్ టాకీసులో పిక్చర్‌కి వెళ్తున్నాను. మన క్లైంట్స్‌ని అడిగి 'పాస్' తీసుకున్నాను. నీకుకూడా కావాలంటే తెప్పిస్తాను. ఏమంటావ్!''

''కానీయ్! తెప్పించు! నేనుకూడా నా ఫామిలీ తీసుకువస్తాను'' అన్నాడు రామారావు, వుచితంగా సినిమా చూడటం తప్పని సందేహించకుండా.

---